సాక్షి రంగారెడ్డి

గురువారం। 6 । ఏప్రిల్ । 2023




శివాజీ పాలన ఆదర్శనీయం

ఛత్రపతి శివాజీ యుద్ధ నైపుణ్యం, పాలనాదక్షత ఆదర్శనీయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో▸



కడ్తాల్‌లో నిర్వహించిన సీతారాముల కల్యాణవేడుకలకు హాజరైన భక్తులు



న్యూస్‌రీల్

జూపార్కులో బెంగాల్ టైగర్ మృతి

మూత్రపిండాల వ్యాధితో మృత్యువాత

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కులో పదేళ్ల వయసున్న రాయల్ బెంగాల్ టైగర్ జో మూత్రపిండాల సమస్యతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. జూపార్కులోని నిఖిల్, అపర్ణలకు పదేళ్ల క్రితం మగ పులి 'జో' జన్మించింది. ఆరు నెలలుగా జో ఆహారం తీసుకోకపోవడంతో జూ వెటర్నరీ వైద్యులు ప్రత్యేక పరీక్షలు జరిపి మూత్రపిండాల వ్యాధికి గురైనట్లు గుర్తించారు. చికిత్స అందించినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఆహారం తీసుకోకపోవడంతో పూర్తిగా నీరసించిపోయిన జో బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు మృతి చెందినట్లు జూపార్కు అధికారులు తెలిపారు. వీబీఆర్‌ఐ, ల్యాంకోన్స్‌తో పాటు పశువైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. కాగా నెహ్రూ జూలాజికల్ పార్కులో గత కొంత కాలంగా పులులు, సింహాలు, ఎలుగుబంటి, అడవి దున్నలు తక్కువ వయసులోనే మూత్రపిండాలు, శ్వాసకోశ వ్యాధులు, కాలేయం చిన్నగా మారి మృత్యువాత పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

శంషాబాద్: ప్రయాణికుడు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. దుబాయ్ నుంచి ఈకే-524 విమానంలో వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతడిని క్షుణ్ణంగా పరిశీలించారు. అతడి ప్యాంటుతో పాటు లోదుస్తులకు పేస్టుగా ఉన్న బంగారాన్ని పొరలుగా అతికించి 373 గ్రాముల బంగారం తీసుకొచ్చినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.23 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు.

రెడ్ అలర్ట్

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లో రెడ్‌అలర్ట్ కొనసాగుతోంది. ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా పలు విభాగాల పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. బేగంపేట విమానాశ్రయం నుంచి పరేడ్‌మైదానం మీదుగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వరకు ఎక్కడ చూసినా పోలీసు పికెటింగ్‌లు ఏర్పాటు చేశారు. పరేడ్ మైదానం, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను ఇప్పటికే ఎస్‌పీజీ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎస్‌పీజీ బృందాలు బుధవారం కూడా ప్రధాని పర్యటించే రెండు ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్ల తీరును పర్యవేక్షించారు. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులతో సమన్వయం చేసుకుంటున్న ఎస్‌పీజీ అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

భద్రతకు 800 మంది

అన్ని రైల్వే డివిజన్ల నుంచి ఆర్‌పీఎఫ్ బృందాలను సికింద్రాబాద్‌కు రప్పిస్తున్నారు. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీతోపాటు వివిధ విభాగాలు కలుపుకొని మొత్తంగా 800 మంది పోలీసుల నేతృత్వంలో రైల్వేస్టేషన్‌లో ప్రధాని భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని 10 ప్లాట్‌ఫామ్‌లను, పరిసర ప్రాంతాలను నిశితంగా సోదాలు చేస్తున్నారు. రైల్వేస్టేషన్‌లోనూ ప్రయాణికుల లగేజీలు తనిఖీ చేస్తున్నారు. జీఆర్‌పీ ఎస్పీ షేక్‌సలీమా, ఆర్‌పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దేబశ్మిత బెనర్జీ నేతృత్వంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించడంతోపాటు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. రైల్వేస్టేషన్ల ప్రవేశ ద్వారాలు మినహా ఇతర ప్రాంతాల మీదుగా స్టేషన్‌లోకి ఎవ్వరూ ప్రవేశించకుండా నిషేధాజ్ఞలు విధించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చుట్టూ ఉన్న పోలీస్ స్టేషన్ల అధికారులను అప్రమత్తం చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అనుమానాస్పద ప్రాంతాలు, వ్యక్తుల పట్ల నిఘా ఉంచాలని, వాహనాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

ముస్తాబవుతున్న రైల్వేస్టేషన్

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 10వ నంబర్ ప్లాట్‌ఫామ్ నుంచి ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. ఇందుకోసం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ బోయిగూడ ప్రవేశ ద్వారం నుంచి 10వ ప్లాట్ ఫామ్ వరకు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్లాట్‌ఫామ్ ఆసాంతం కాషాయం, తెలుపు వర్ణం వస్త్రాలతో అలంకరిస్తున్నారు. ఈ నెల 8న ఉదయం 11.10 గంటలకు బేగంపేట విమానాశ్రయంకు నరేంద్రమోదీ చేరుకోనున్నారు. 11.20 నిమిషాలకు వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభించిన అనంతరం 11.30 గంటలకు పరేడ్ మైదానం వెళ్తారని పోలీసు అధికారులు తెలిపారు.

మద్యం మత్తు.. బతుకులు చిత్తు

- శంషాబాద్ మండలం నానాజీపూర్‌కు చెందిన రాజు(40) తరచూ మద్యం తాగి భార్య జ్యోతిని వేధించేవాడు. సహనం కోల్పోయిన ఆమె గత నెల 7న భర్తపై కత్తితో దాడి చేసింది. గొంతు, ముఖంపై తీవ్రగాయాలైన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి చనిపోవడం, హత్య కేసులో తల్లి జైలుకు వెళ్లడంతో 11 ఏళ్ల కుమార్తె, పదేళ్ల కుమారుడు అనాథల్లా రోడ్డున పడ్డారు.
- ఫరూఖ్‌నగర్‌కు చెందిన ఓ బాలిక తల్లి చనిపోవడంతో తండ్రి(40)తో కలిసి ఉంటోంది. కూలీ పని చేసుకునే తండ్రి మద్యానికి బానిసయ్యాడు. కంటికి రెప్పలా కాపాడాల్సిన బిడ్డపై మద్యం మత్తులో అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఇటీవల తరచూ వాంతులతో బాధపడుతున్న సదరు బాలికను స్కూలు ఉపాధ్యాయులు ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించగా, అసలు విషయం బయటపడింది.
- మద్యానికి డబ్బులివ్వలేదని భార్యను హతమార్చిన ఘటన మొయినాబాద్ పీఎస్ పరిధిలో వెలుగు చూసింది. వికారాబాద్ జిల్లా కోస్గి మండలం నాచారం గ్రామానికి చెందిన మహ్మద్ హుస్సేన్ భార్య హస్సనీబేగంతో కలిసి బతుకుదెరువుకోసం మొయినాబాద్‌లో ఉంటున్నాడు. మద్యానికి బానిసైన ఇతను తాగేందుకు డబ్బులు ఇవ్వలేదనే కోపంతో ఇటీవల భార్యను హతమార్చాడు.
- కేశంపేట మండలం ఇప్పలపల్లికి చెందిన తొందుపల్లి హన్మంతరెడ్డి(37) మద్యానికి బానిసయ్యాడు. అలవాటు మానుకోవాలని తండ్రి గోవర్ధన్‌రెడ్డి తరచూ హెచ్చరించే వాడు. మూడు రోజుల క్రితం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన తండ్రి బలమైన రాడ్డుతో దాడి చేయగా, తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందాడు.



ఆందోళన కలిగిస్తున్న సంఘటనలు

- రోడ్డున పడుతున్న బాధిత కుటుంబాలు
- రాష్ట్రవ్యాప్తంగా మన జిల్లాలోనే అత్యధికంగా మద్యం విక్రయాలు
- విచక్షణ కోల్పోతున్న మందుబాబులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లా వాసులను మద్యం మత్తు పట్టి పీడిస్తోంది. సరదగా మొదలైన ఈ అలవాటు వ్యసనంగా మారుతోంది. కుటుంబ రోజువారీ సంపాదన మొత్తం మద్యం పాలవుతుండగా.. పచ్చని సంసారాలు వీధిన పడుతున్నాయి. మద్యం మత్తులో విచక్షణ కోల్పోతున్న వారు వేధింపులు, దాడులకు పాల్పడుతున్నారు. కొంత మంది హత్యలు, అత్యాచారాలకు తెగబడుతుండగా.. మరికొంత మంది కాలేయ కేన్సర్లు, జీర్ణకోశ సంబంధ వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. చికిత్సల పేరుతో సర్వం పోగొట్టుకుని అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఖజానా నింపుకొనేందుకు ప్రభుత్వానికి అనేక మార్గాలున్నప్పటికీ మద్యం విక్రయాలనే ప్రధానంగా ఎంచుకోవడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టార్గెట్లు విధించి.. అమ్మకాలు

ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.32 వేల కోట్లకుపైగా ఆదాయం సమకూరుతోంది. ఆదాయాన్ని మరింత పెంచుకోవాలనే ఉద్దేశంతో బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తోంది. ఈ విషయంలో మహిళల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మద్యం విక్రయాల్లో ఇతర జిల్లాలతో పోలిస్తే రంగారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం గమనార్హం. మన జిల్లా నుంచి నెలకు సగటున రూ.650 కోట్ల నుంచి రూ.700 కోట్ల ఆదాయం సమకూరుతోంది. మద్యం మత్తులో క్షణికావేశానికి లోనై హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా తరచూ ఇలాంటి కేసులు నమోదవుతున్నా పాలకుల్లో చలనం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

డేంజర్ జోన్‌లో ఉన్నాం

తెలంగాణ డేంజర్ జోన్‌కు చేరువలో ఉంది. మా అంచనా మేరకు 15 ఏళ్లు పైబడిన వారిలో 90 శాతం మంది మద్యానికి అలవాటుపడ్డారు. కల్లు, బీరు, విస్కీ, గంజాయి, డ్రగ్స్ వినియోగిస్తున్నారు. సరదాగా మొదలైన ఈ అలవాటు క్రమంగా వ్యసనంగా మారుతోంది. ఆదాయం కోసం ప్రజల ప్రాణాలతో ఆడుకోవడం ప్రభుత్వానికి తగదు.

– ఎం.పద్మనాభరెడ్డి, ఫోరం ఫర్‌గుడ్ గవర్నెన్స్

మహిళలే బాధితులు

మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం మహిళల జీవితాలతో ఆడుకుంటోంది. మద్యం ప్రభావిత కేసుల్లో మహిళలే ఎక్కువగా బాధితులవుతున్నారు. ఆర్థికంగా అప్పులపాలు చేసి, సంసారాలను వీధి పాలు చేస్తున్న మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించాలి. ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

– జయమ్మ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు

కల్యాణం కమనీయం

కడ్తాల్: మండల కేంద్రంలోని విజయగణపతి, సరస్వతీ సహిత సీతారామచంద్రస్వామి ఆలయంలో కొలువైన శ్రీరాముడి కల్యాణ వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత రాజమణి, బస్వారాజ్ దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారిని, సీతమ్మతల్లిని పట్టువస్త్రాలతో ముస్తాబు చేశారు. శివాచార్య మహాస్వామి బృందం, అంగడిమఠం భువనేశ్వర్ గురువుల వేద మంత్రోచ్చారణల మధ్య రాములోరి కల్యాణం జరిపించారు. వేడుకలను తిలకించేందుకు స్థానికులు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.



కల్యాణ శోభతో అలరారుతున్న సీతారాములు

రాష్ట్రంలో నియంత పాలన



అబ్దుల్లాపూర్‌మెట్‌లో సీఎం దిష్టిబొమ్మతో ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

- తప్పుడు కేసులతో బీజేపీని భయపెట్టలేరు
- పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి
- అబ్దుల్లాపూర్‌మెట్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రంలో కొనసాగుతున్న నియంత పాలనను అంతమొందించడానికి ప్రతీ బీజేపీ కార్యకర్త పోరాడాల్సిన సమయం ఆసన్నమైనదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. బండి సంజయ్ అరెస్ట్, రిమాండ్‌ను నిరసిస్తూ అబ్దుల్లాపూర్‌మెట్‌లో బుధవారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తప్పుడు కేసులతో బీజేపీని భయపెట్టలేరని హెచ్చరించారు. వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు సాయంత్రం వేళ సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్, కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు, బొడిగ గోవర్ధన్, రామసాని మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఓబీసీ మోర్చా ఇన్‌చార్జ్ రంగా జంగమయ్యగౌడ్, పాపయ్య, మండల ప్రధాన కార్యదర్శులు బొడిగె సురేష్‌గౌడ్, శ్రావణ్‌చా పాల్గొన్నారు.

ఇదేంది 'బై'!

- అసైన్డ్, సీలింగ్ భూములకు పట్టా
- సర్వేనంబర్లకు బై నంబర్లు వేసి మార్పు
- రిజిస్ట్రేషన్ శాఖలో ఒకలా.. ధరణిలో మరోలా ఉంటున్న వివరాలు
- రెవెన్యూ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: నిన్న మొన్నటి వరకు అసైన్డ్, సీలింగ్, భూదాన్, వక్ఫ్ జాబితాలో ఉన్న భూములు సడన్‌గా పట్టా భూములుగా మారుతున్నాయి. అసలు సర్వే నంబర్లు మాయమై.. వాటి స్థానంలో కొత్తగా అనేక బై నంబర్లు పుట్టుకొస్తున్నాయి. రాత్రికి రాత్రే భూముల క్లాసిఫికేషన్లు మారిపోతున్నాయి. అంతేకాదు ఒకే రెవెన్యూ పరిధి.. ఒకే సర్వే నంబర్‌లోని భూముల వివరాలు.. ఇటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌లో ఒకలా.. అటు 'ధరణి' వెబ్‌సైట్‌లో మరోలా నమోదు చేసి తీవ్ర గందరగోళం సృష్టిస్తున్నారు.

- ఇబ్రహీంపట్నం మండలం ఆదిబట్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 44లో 13.26 ఎకరాల భూమి ఉంది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ విభాగంలో సీలింగ్ సర్‌ప్లస్ లాండ్‌గా నమోదై ఉంది. కానీ ధరణిలో ఇదే సర్వే నంబర్‌కు ఇటీవల బై నంబర్లు పుట్టుకొచ్చాయి. నిషేధిత జాబితాలో ఉన్న భూమి పట్టా భూమిగా మారింది. అధికారులు ఏ ఆధారాలతో దీన్ని పట్టా భూమిగా మార్చారో ఇప్పటికీ అంతు చిక్కడం లేదు.
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 86, 90, 93, 99, 100, 101లలో సుమారు 17 ఎకరాల భూమి ఉంది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్‌లో అర్బన్ ప్రొహిబిటెడ్ జాబితాలో నమోదై ఉంది. అంటే ఈ భూములు అమ్మడం, కొనడంపై నిషేధం. కోర్టు కేసులో ఉన్న ఈ భూమి 'ధరణి'లో పట్టా భూమిగా ఎలా మారిందో అర్థం కావడం లేదు.
- మహేశ్వరం మండలం కొంగరకుర్దు- ఎలో సుమారు 500 ఎకరాల వక్ఫ్ భూమి ఉంది. 1954 నుంచి ఇప్పటి వరకు పట్టా కాలమ్‌లో సయ్యద్ షారాజ్ ఖత్తార్ హుస్సేన్‌సాబ్ దర్గా పేరు ఉంది. సర్వే నంబర్లు 85, 86, 88, 89లోని 58 ఎకరాల భూమిని వక్ఫ్ భూమిగా పేర్కొంటూ 2008లో అప్పటి ప్రభుత్వం గెజిట్ కూడా జారీ చేసింది. ఈ వక్ఫ్ భూమి పట్టా భూమిగా ఎలా మారిందనేదీ అంతు చిక్కడం లేదు. కొంగరకుర్దు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 82లోని ఆరెకరాల వక్ఫ్ భూమికి సైతం పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసి, ఆ తర్వాత రద్దు చేయడం జిల్లా రెవెన్యూ అధికారులకే చెల్లింది.
- మాడ్గుల మండలం ఇర్విన్ రెవెన్యూ పరిధిలో రాజబహదూర్ కుటుంబానికి సర్వే నంబర్లు 186, 299, 534,539,716,845,1152,1198, 1236,1240,1306, 1406,1413,1414లలో వంద ఎకరాలకుపైగా భూమి ఉంది. నాలుగు సర్వే నంబర్లలో ఏకంగా 24.35 ఎకరాల భూమిని సక్సేషన్ పద్ధతిలో భూ మార్పిడి ఎలా చేశారనేదీ అంతు చిక్కడం లేదు. కొంత మంది రెవెన్యూ అధికారులు అడిగినంత ముట్టజెబితే చాలు ఏదైనా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఇబ్రహీంపట్నం: బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

మహనీయుల మార్గంలో నడవాలి

మహనీయులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపైనా ఉందని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కీర్తించారు. ప్రతిఒక్కరూ జగ్జీవన్‌రామ్ చూపిన మార్గంలో నడవాలన్నారు.

రూ.131 కోట్లతో ఉపాధి

- జిల్లా వ్యాప్తంగా 45,44,136 పని దినాల లక్ష్యం
- ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన పనులు
- రోజువారీ కూలీ రూ.272

యాచారం: గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులకు.. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.131 కోట్ల నిధులు కేటాయించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్త బడ్జెట్‌కు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,61,164 జాబ్ కార్డులు, 2,71,137 మంది కూలీలు ఉన్నారు. ఈ ఏడాదిలో జాబ్ కార్డులున్న 80 శాతానికి పైగా కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీల చేత పనులు ప్రారంభింపజేశారు. భూ అభివృద్ధి, కందకాల తవ్వకం, చెట్ల తొలగింపు, మొక్కలు నాటడం వంటివి చేయిస్తున్నారు. ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్ పరిధిలో 10 వేల పనిదినాలు కల్పించాలని టార్గెట్ విధించారు. లేదంటే సదరు ఎఫ్‌ఏపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు. గతేడాది పనుల ప్రారంభంలో ఎఫ్‌ఏలు లేకపోవడంతో పనులకు వచ్చేందుకు కూలీలు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. కానీ ఈ ఏడాది క్షేత్ర సహాయకులు విధుల్లో చేరడంతో ఉపాధి పనులు ఊపందుకునే అవకాశాలున్నాయి.

కూలీ రేటు పెంపుతో..

- గతంలో రూ.252గా ఉన్న రోజువారీ ఉపాధి కూలీ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం రూ.272 పెంచింది.
- రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండానే పని చేసే కూలీలకు నేరుగా ఎన్‌ఐసీ(నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్) ద్వారా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతాయి.
- పనుల్లో అవకతవకలకు తావు లేకుండా ఉదయం పనులు ప్రారంభించే సమయంలో, మధ్యాహ్నం సమయంలో ఫొటోలు తీసి రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉంటుంది.
- పనులు చేసే సమయంలో ఎంపీడీఓలు, ఏపీఓలు పర్యవేక్షించాలి.
- గతేడాదితో పోలిస్తే ఈసారి ఉపాధి పనులకు బడ్జెట్‌ను తగ్గించారు.
- 2022- 23 గాను 63,09,052 పని దినాలు లక్ష్యంగా పెట్టుకుని, రూ.162 కోట్ల బడ్జెట్ కేటాయించారు.



మంచాల మండలం చీదేడ్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మొత్తం జాబ్ కార్డులు: 1,61,164	
కూలీలు: 2,71,137	
పని దినాల లక్ష్యం: 45,44,136	
పనులకు వస్తున్న కూలీల సంఖ్య: 11,343	

- 2023- 24 సంవత్సరానికి గాను పనిదినాలను 45,44,136 తగ్గించి, బడ్జెట్‌ను సైతం రూ.131 కోట్లకు కుదించారు.
- రోజువారీ కూలీ మొత్తాన్ని రూ.15 పెంచినప్పటికీ పనిదినాల తగ్గింపుతో కూలీలకు అన్యాయం జరిగే అవకాశం ఉంది.

చైతన్యం కల్పిస్తున్నాం



ఈ ఏడాది ప్రారంభం నుంచే కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా చైతన్యం కల్పిస్తున్నాం. చేసే పనుల్లో నాణ్యత పాటించడంతో పాటు ఉదయం, మధ్యాహ్నం పనులు చేసే చోట కూలీల ఫొటోలు, నిత్యం రికార్డుల నమోదు ఉండేలా పర్యవేక్షణ చేస్తాం. వారం రోజుల్లోపు కూలి డబ్బులు అందేలా చూస్తాం.

– విజయలక్ష్మి, ఎంపీడీఓ యాచారం

టప్పాచబుత్రలో కాల్పుల కలకలం

- పాత కక్షలతోనే హత్య
- మృతుడు బీజేపీ నేత బంధువు



ఆకాష్‌సింగ్ (ఫైల్)

అబిడ్స్/గోల్కొండ: పాతబస్తీలోని టప్పాచబుత్రలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన కాల్పుల ఘటన ఈ ప్రాంతంలో కలకలం రేపింది. పాత కక్షల కారణంతో ఓ యువకుడిని రివాల్వర్‌తో కాల్చి...కత్తితో పొడిచి హత్య చేయడం విషాదం నింపింది. ఈ ఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..హరిదాస్‌నగర్‌కు చెందిన ఆకాష్‌సింగ్ (26) అలియాస్ చోటు, కార్వాన్ జాఫర్‌గూడకు చెందిన క్రాంతిసాగర్ మధ్య పాత క్షలున్నాయి. గతంలో క్రికెట్ బుకీగా వ్యవహరించడంతో పాటు పలు వ్యాపారాలు చేసిన క్రాంతిసాగర్ గతేడాది దసరా ఉత్సవాల్లో ఆకాష్‌సింగ్‌తో చిన్న విషయంపై గొడవకు దిగారు. ఆ గొడవలో క్రాంతిసాగర్‌తో పాటు అతని స్నేహితులు మరో ముగ్గురిని ఆకాష్‌సింగ్ దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అప్పట్లో పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆకాష్‌సింగ్‌పై పగబూనిన క్రాంతిసాగర్ మంగళవారం రాత్రి పొద్దుపోయాక 12.30 గంటల సమయంలో ఆకాష్‌సింగ్ స్నేహితుడు ఇమ్రాన్‌కు ఫోన్‌చేసి టప్పాచబుత్రకు రమ్మన్నాడు. క్రాంతిసాగర్‌తో సయోధ్య కుదిరిస్తానని చెప్పడంతో ఆకాష్‌సింగ్ తన ఇంట్లో చెప్పి అక్కడకు వచ్చాడు. ఆకాష్‌సింగ్ ఇమ్రాన్‌తో మాట్లాడుతుండగా వెనుక నుంచి వచ్చిన క్రాంతిసాగర్ అనుమతి లేని రివాల్వార్‌తో ఆకాష్‌సింగ్ తలపై, చాతిలో అతి దగ్గరగా మూడు రౌండ్లు కాల్పులు జరపడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. దీంతో పాటు కత్తితో కూడా ఆకాష్‌సింగ్‌ను పొడిచాడు. విషయం తెలుసుకున్న టప్పాచబుత్ర పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆకాష్‌సింగ్‌ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందాడని డాక్టర్లు ధృవీకరించారు.

పోలీసుల అదుపులో నిందితులు

క్రాంతిసాగర్‌తో పాటు అతని ఇద్దరి స్నేహితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. వారి వద్ద హత్యకు ఉపయోగించిన రివాల్వర్, కత్తినికూడా స్వాధీనపరచుకున్నట్లు తెలిసింది. ఈ కేసును టప్పాచబుత్ర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడు కార్వాన్ బీజేపీ నేత బంధువు

ఆకాష్‌సింగ్ కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జి అమర్ సింగ్‌కు మేనల్లుడు. కార్వాన్‌లో ఆకాష్‌సింగ్ మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉస్మానియా ఆసుపత్రికి ఆకాష్‌సింగ్ బంధువులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

మైనింగ్ పనులు నిలిపేయండి

- లేదంటే ఆందోళన ఉధృతం
- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి


సాకిబండ తండా వాసులతో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: సాకిబండ తండా సమీపంలో చేపట్టిన మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి హెచ్చరించారు. బుధవారం ఆయన తండావాసులతో కలిసి మైనింగ్ పనులు చేపడుతున్న ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఏళ్ల నుంచి అక్రమంగా మైనింగ్ చేపడుతున్నారని ఆరోపించారు. ఈ పనులతో తండా వాసులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనులను నిలిపి వేయాలని ఆందోళన చేపడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వెళ్లిబుచ్చారు. మైనింగ్ యాజమాన్యానికి ఆమనగల్లు పోలీసులు భద్రత కల్పిస్తూ ఆందోళన చేస్తున్న గిరిజనులపై అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నాయకుల ప్రోద్బలంతో, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో ఈ పనులు నడుస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా పనులను నిలిపేయాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, తండా వాసులు పాల్గొన్నారు.

శివాజీ పాలన ఆదర్శనీయం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- హిమాయత్‌నగర్‌లో విగ్రహావిష్కరణ


ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

మొయినాబాద్‌రూరల్: ఛత్రపతి శివాజీ యుద్ధ నైపుణ్యం, పాలనాదక్షత ఆదర్శనీయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంజుల యాదవ్ అన్నారు. శాంతి యువజన సంఘం అధ్యక్షుడు మల్లేశ్ ఆధ్వర్యంలో బుధవారం హిమాయత్‌నగర్‌లో ఛత్రపతి శివాజీ నూతన విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శివాజీ జీవితం ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకుని సన్మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రంజీవంతు, ఎంపీటీసీ సభ్యుడు కాలె శ్రీకాంత్, ఉప సర్పంచ్ శ్యామ్ రావు, వార్డు సభ్యులు యాదయ్య, కుమార్, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవి తదితరులు పాల్గొన్నారు.

నడుస్తున్న రైలుకు ఎదురెళ్లి..

యువకుడి బలవన్మరణం


రమేశ్ (ఫైల్)

శంకర్‌పల్లి: కుటుంబ కలహాలతో ఓ యువకుడు నడుస్తున్న రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని పత్తేపురం గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మహాలింగపురం గ్రామానికి చెందిన రమేశ్(28) పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. దీంతో ఉదయం పంచాయితీ పెడతామని కుటుంబీకులు హెచ్చరించారు. ఆందోళన చెందిన రమేశ్ బుధవారం ఉదయం 9.30గంటల ప్రాంతంలో పత్తేపురం శివారులోని రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని రైలుకు ఎదురుగా వెళ్లాడు. రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. వికారాబాద్ రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సంపులో పడి వ్యక్తి మృతి


పోచయ్య మృతదేహం

కొత్తూరు: ప్రమాదవశాత్తు నీటిసంపులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మున్సిపాలిటీ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. ఎస్ఐ శంకర్ తెలిపిన ప్రకారం.. పట్టణానికి చెందిన దానగల్ల పోచయ్య(62) మండలకేంద్రంతో పాటు ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న ఓ గోదాం క్వాటర్స్ వద్ద పాత సామాన్లు(కాగితాలు, ఇనుప వస్తులు) సేకరించి విక్రయిస్తూ అక్కడే నిద్రిస్తున్నాడు. కాగా ఈ నెల 4న క్వాటర్స్ వద్దకు వచ్చి భోజనం చేసిన తర్వాత చేతులు శుభ్రం చేసుకునే క్రమంలో పక్కనే ఉన్న నీటిసంపులో పడిపోయాడు. రాత్రి కావడంతో ఎవరూ గమనించలేదు. క్వాటర్స్‌లో నివాసం ఉండేవారు బుధవారం ఉదయం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కూతురు ప్రేమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెచ్చిపోతున్న దొంగలు


సైకిల్‌ను ఎత్తుకెళ్తున్న దుండగుడు

బండ్లగూడ: నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాలను ఎంచుకుని దొంగలు చేతివాటం చూపిస్తున్నారు. బుధవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ద్వారకానగర్‌లోని ఓ ఇంట్లో దుండగుడు సైకిల్‌ను ఎత్తుకెళ్లాడు. ఇది సీసీ కెమెరాలో రికార్డు అయింది. సైకిల్ విలువ రూ.15 వేలు అని యజమాని తెలిపారు. ఈ మేరకు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శోభాయాత్రకు ప్రత్యేక బందోబస్తు

షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్


మాట్లాడుతున్న ఏసీపీ కుషాల్కర్

షాద్‌నగర్: హనుమాన్ శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ అన్నారు. బుధవారం పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. హనుమాన్ జయంతి ఉత్సవాలను కలిసి కట్టుగా జరుపుకోవాలని సూచించారు. శోభాయాత్ర సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గురువారం నిర్వహించే శోభాయాత్రకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని వివరించారు. నిర్ణీత సమయంలో శోభాయాత్రను ప్రారంభించి అర్ధరాత్రిలోపు పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, వివిధ పార్టీ నేతలు పాల్గొన్నారు.

పీస్ కమిటీ సమావేశం

శంషాబాద్: పండగలను శాంతియుతంగా జరుపుకోవాలని శంషాబాద్ ఏసీపీ భాస్కర్ సూచించారు. రంజాన్, హనుమాన్ శోభాయాత్ర, గుడ్‌ఫ్రైడే సందర్భంగా బుధవారం ఏసీపీ కార్యాలయంలో అన్ని వర్గాల నేతలతో శాంతియుత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవరికి ఇబ్బందులు కలిగించకుండా ర్యాలీలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా, కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్, సుల్తాన్‌పల్లి సర్పంచ్ దండు ఇస్తారి, నాయకులు అంజద్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్: హనుమాన్ శోభాయాత్ర నేపథ్యంలో రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ కార్యాలయంలో బుధవారం పీస్ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయా ప్రాంతాల్లోని మత పెద్దలు, దేవాలయ, ప్రార్థన మందిరాల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఒక రి పండుగలను ఒకరు గౌరవించుకుంటూ ఆనందోత్సవాల మధ్య పండుగలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. శోభాయాత్ర నేపథ్యంలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

నకిలీ జోతిష్యుల అరెస్టు

- రూ.84వేలు, 4ఫోన్‌లు, కారు సీజ్


పోలీసులు అరెస్టు చేసిన నకిలీ జోతిష్యులు

మణికొండ: వచ్చీ రాని జోతిష్యంతో ప్రజలను మోసం చేస్తున్న ఇద్దరిని, ఓ కారు డ్రైవర్‌ను నార్సింగి ఎస్‌ఓటీ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం...సిరిసిల్ల జిల్లాకు చెందిన ఎర్నాల సారయ్య, గిత్త శివకుమార్‌లు తమ మారుతి బ్రెజా కారులో తిరుగుతూ కనిపించిన వారికి మీకు సమస్యలు ఉన్నాయి, ఎవరో మీకు చేతబడులు చేశారు, వాటిని పూజ చేసి పోగొడతాము అని నమ్మిస్తారు. వారు ఇచ్చిన డబ్బులు తీసుకుని వచ్చీరాని పూజలు చేసి అక్కడి నుంచి ఉడాయిస్తారు. బుధవారం కోకాపేటలోని గోల్డన్‌మైల్ లేఅవుట్‌లో తిరుగుతూ కొందరిని మోసం చేయటంతో వారు సమాచారం ఇవ్వటంతో అరెస్టు చేశారు. వారి నుంచి రూ.84వేల డబ్బు, 4సెల్ ఫోన్‌లు, ఓ కారు, మొత్తం రూ.12 లక్షల విలువగల సొత్తును స్వాధీనం చేసుకుని నార్సింగి పోలీసులకు అప్పగించినట్టు ఎస్‌ఓటీ పోలీసులు తెలిపారు.

పాత నేరస్తుల మధ్య గొడవ...

హత్యాయత్నానికి దారితీసిన వైనం


చికిత్స పొందుతున్న కృష్ణ

శంకర్‌పల్లి: ఇద్దరు పాత నేరస్తుల మధ్య గొడవ హత్యాయత్నానికి దారితీసింది. ఈ ఘటన మండల పరిధిలోని మహారాజ్‌పేట్ గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. శంకర్‌పల్లి పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గోపులారం గ్రామానికి చెందిన కృష్ణ మద్యం మత్తులో రాత్రి 10.30గంటలకు మహారాజ్‌పేట్ గ్రామానికి చెందిన మంజుల ఇంటివద్దకు వెళ్లి గొడవకు దిగాడు. వీరిద్దరూ కలిసి గతంలో పలు చోరీలకు పాల్పడ్డారు. గొడవ పెద్దగా మారడంతో మంజుల భర్త శ్రీనివాస్, కుమారులు సంజయ్, వంశీ కృష్ణపై కర్రలతో దాడి చేశారు. కూరగాయల కత్తితో గొంతు కోశారు. గమనించిన గ్రామస్తులు వెంటనే బాధితుడిని 108 వాహనంలో నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కృష్ణపై సంగారెడ్డి, పటాన్‌చెరు, వికారాబాద్ పీఎస్‌లలో దొంగతనాల కేసులు ఉన్నాయి. 2019లో పీడీ యాక్ట్ నమోదు చేయడంతో జైలుకు వెళ్లి వచ్చాడు. కాగా హత్యాయత్నాకి పాల్పడిన శ్రీనివాస్, సంజయ్, వంశీలపై కేసు నమోద చేశామని శంకర్‌పల్లి సీఐ వి.ప్రసన్న కుమార్ తెలిపారు.

అంతర్రాష్ట్ర సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు


నిందితుల వివరాలు తెలుపుతున్న ఏసీపీ గంగాధర్

రాజేంద్రనగర్: జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన 15 రోజులకే దొంగతనానికి పాల్పడ్డ ఓ అంతర్రాష్ట్ర సెల్‌ఫోన్ల దొంగను రాజేంద్రనగర్ సీసీఎస్, రాజేంద్రనగర్ పోలీసులు సంయుక్తంగా పట్టుకుని అతడి వద్ద నుంచి 15 లక్షల రూపాయల విలువ చేసే సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్ ఏసీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ గంగాధర్ వివరాలను వెల్లడించారు. కర్నూల్ జిల్లా, చదువుల రామయ్య కొట్టాలు ప్రాంతానికి చెందిన కొమ్ము వంశీకృష్ణ(29) ఆటో డ్రైవర్. ఇతడు సెల్‌ఫోన్ దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడతాడని.. కర్నూల్, తిరుపతి, గద్వాల్, గుత్తి, అనంతపూర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఆరు కేసుల్లో నిందితుడని చెప్పారు. గత నెల 23వ తేదీన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 122 పిల్లర్ వద్ద ఉన్న లాట్ మొబైల్ దుకాణంలో జొరబడి యాపిల్-12 ఫోన్‌లు నాలుగు, గెలాక్సి సామ్‌సంగ్ ఫోన్‌లు 8, వన్ ప్లస్ ఫోన్‌లు ఏడు, ఒప్పో, వివో ఫోన్‌లను దొంగిలించాడు. మొత్తం 21 ఫోన్‌ల విలువ 15,38,000 ఉంటుందని దుకాణం యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొంగతనం చేసిన వాటిలో ఒక ఫోన్‌ను తనకు తెలిసిన బంధువుకు విక్రయించాడు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పోలీసులు బుధవారం ఉదయం నిందితుడిని పట్టుకొని అతడి వద్ద నుంచి 15 సెల్‌ఫోన్‌లను, 8,716 రూపాయల నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

ప్రత్యామ్నాయ సంస్కృతి కోసం సాహిత్య వేదిక

సాక్షి, సిటీబ్యూరో: ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీన పరిచి దేశ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ ప్రయత్నాలకు వ్యతిరేకంగా గళమెత్తాల్సిన అవసరముందని జి.విమల గద్దర్ తెలిపారు. ఈ కార్యాచరణలో భాగంగా గద్దర్ సాహిత్య సాంస్కృతిక వేదికను ప్రారంభించామని, దీనికి సంబంధించి గురువారం అల్వాల్‌లోని యాదమ్మ నగర్ డా.జీవి.చంద్రకిరణ్ స్మారక మందిరంలో ఆవిర్భావ సదస్సును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగ రిజర్వేషన్లు ఉన్న రైల్వే, విమాన తదితర పెద్ద పరిశ్రమలన్నీ ప్రైవేటు పరమైతున్న తరుణంలో ప్రత్యామ్నాయ సంస్కృతిపైన పోరాటం చేయాల్సిన అవసరముందని అన్నారు. ప్రైవేటీకరణతో చేతి వృత్తులన్నీ అంతరించి, కులవృత్తులపైన ఆధారపడిన ప్రజలు తీవ్ర సంక్షోభంలోకి చేరుకోనున్నారని తెలిపారు.

అదనపు కలెక్టర్ నివాళి

సాక్షి, సిటీబ్యూరో: బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జగ్జీవన్ రామ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మూసేస్తారా.. పరిహారం చెల్లిస్తారా?

- స్పాంజ్ ఐరన్ పరిశ్రమ ఎదుట వీర్లపల్లి గ్రామస్తుల ఆందోళన
- 12 రోజుల గడువు కోరిన యాజమాన్యం


స్పాంజ్ ఐరన్ పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

నందిగామ: ప్రజల ఆరోగ్యానికి, పంటలకు యమపాశాలుగా మారిన స్పాంజ్ ఐరన్ పరిశ్రమలను మూసి వేయాలని బుధవారం వీర్లపల్లి గ్రామస్తులు పరిశ్రమల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ శివారులోని శివశక్తి, జాగృతి పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో పంట పొలాలతో పాటు. ఇళ్లు, తమ ఆరోగ్యాలు పాడవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ మంతా నల్లటి పొగతో నిండిపోతోందని, పరిశ్రమల నుంచి వచ్చే నల్లని బూడిద కణాలు ఇళ్లపై పడి ఇబ్బంది పడుతున్నామన్నారు. గతంలో ఎన్నోసార్లు పరిశ్రమ యాజమాన్యాన్ని సంప్రదించినా కాలుష్యం రాకుండా చూస్తామన్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజురోజుకు సమస్య తీవ్రమవుతుందని ఆవేదన వెళ్లిబుచ్చారు. పంట నష్టపరిహారం పేరుతో ఎంతో కొంత డబ్బు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారన్నారు.

ప్రతీ ఇంటికి పరిహారం ఇవ్వాలి

నివాస గృహాలపై నల్లని కణాలతో ఇళ్లన్నీ పాడవుతున్నాయని.. ఇళ్లకు రంగులేసుకునేందుకు ప్రతీ ఇంటికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే పరిశ్రమను మూసివేయాలని పరిశ్రమల గేటు ఎదుట బైఠాయించారు. పరిశ్రమ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమస్య పరిష్కరించేత వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకున్నారు. కాగా పరిశ్రమ యాజమాన్యం 12 రోజులు సమయం కోరడంతో అప్పటి వరకు పరిశ్రమను మూసివేయాలన్నారు. ఈ ఆందోళనలో ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు కాట్న లత, సర్పంచ్ చిందం రాములమ్మ, నాయకులు కాట్న శ్రీశైలం, చిందం నర్సింహ, బేగ్, అన్వర్, పాండు, మహిళలు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డబ్బుల కోసం జబ్బుల సృష్టి!

- ముఖ్యమంత్రి సహాయ నిధుల కోసం నలుగురి కుట్ర
- సహకరించిన నల్లగొండ, ఖమ్మంలోని ఆస్పత్రులు
- నగదు మంజూరు చేశాక గుర్తించిన అధికారులు
- కేసు నమోదు చేసిన హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు
- మరికొన్ని బిల్లులు ఇలా నకిలీవే అనే అనుమానాలు

హిమాయత్‌నగర్: నకిలీ వైద్య బిల్లులతో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి నగదు మంజూరు చేయించుకుని కాజేసిన వ్యవహారంపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో (సీసీఎస్) కేసు నమోదైంది. ప్రాథమిక సమాచారం ప్రకారం నలుగురు నిందితులతో పాటు రెండు ఆస్పత్రుల పైనా ఇది రిజిస్టరైంది. దర్యాప్తు నేపథ్యంలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు. అనారోగ్యం బారినపడిన వారిని ఆదుకోవడానికీ సీఎంఆర్ఎఫ్ నుంచి నిధులు మంజూరవుతూ ఉంటాయి. ఆయా ఆస్పత్రుల్లో చేరడానికి ముందే రోగులు దరఖాస్తు చేసుకుంటే లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) ఇవ్వడం ద్వారా ఉచిత వైద్యం అందేలా అధికారులు చర్యలు తీసుకుంటారు. ఎల్ఓసీ జారీ కావడానికి కొంత సమయం పడుతుంది. ఈ నేపథ్యంలోనే అనివార్య కారణాలు, అత్యవసర పరిస్థితుల్లో ముందే ఆస్పత్రుల్లో చేరి వైద్యం చేయించుకున్న వాళ్లు ఆ మొత్తాన్ని రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకుంటారు. ఈ బిల్లుల్ని స్క్రూటినీ చేసే కమిటీ ఎంత మంజూరుకు సిఫార్సు చేస్తుందో ఆ మొత్తం రోగుల ఖాతాల్లోకి బదిలీ అవుతాయి. నల్లగొండ జిల్లా జన్‌పహాడ్‌కు చెందిన బి.జ్యోతి, బి.లక్ష్మి, మంగళ్ దుబ్బతండాకు చెందిన ధీరావత్ నగర్ మిర్యాలగూడలోని మహేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో, పోల్యాతండాకు చెందిన రమావత్ శివ ఖమ్మం నెహ్రూనగర్‌లోని శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందినట్లు నాలుగు బిల్లులు సీఎంఆర్ఎఫ్‌కు చేరాయి. వీటిని పరిశీలించిన సీఎంఆర్ఎఫ్ కార్యాలయం రూ.1,52,196, రూ.1,50,567, రూ.1,50,272, రూ.1,55,854 మంజూరు చేస్తూ తమ రెవెన్యూ విభాగానికి ఫైల్ పంపింది. దీని ఆధారంగా ఆ మొత్తం మంజూరు చేసిన సీఎంఆర్ఎఫ్ రెవెన్యూ అధికారులు ఆ మొత్తాలను రోగుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఆపై అధికారులు చేపట్టిన వెరిఫికేషన్‌లో భాగంగా ఈ నాలుగు బిల్లులపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆస్పత్రులతో కలిసి కొందరు కుట్ర చేసి సీఎంఆర్ఎఫ్ నిధులు కాజేసినట్లు ఆరోపిస్తూ రెవెన్యూ డిపార్ట్‌మెంట్ (సీఎంఆర్ఎఫ్) సెక్షన్ ఆఫీసర్ డీఎస్ఎన్ మూర్తి గత నెల 21న సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇలాంటి బిల్లులు మరికొన్ని వచ్చి ఉండచ్చని, రాష్ట్ర వ్యాప్తంగా ఈ స్కామ్ మూలాలు ఉంటాయని అనుమానించారు. దీంతో కేసు పరిధి నేపథ్యంలో దర్యాప్తు నిమిత్తం సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ ఫైల్ అందుకున్న ఇక్కడి అధికారులు గత శుక్రవారం ఐపీసీలోని 420, 468, 471, 120 (బీ) రెడ్ విత్ 34 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌ను రీ-రిజిస్టర్ చేసి దర్యాప్తు ప్రారంభించారు. జ్యోతి, లక్ష్మి, ధీరావత్, శివలతో కలిసి కుట్ర పన్నిన ఆస్పత్రులు నకిలీ బిలుల్లు జారీ చేయడం ద్వారా కమీషన్ పొందాయా? లేక ఆస్పత్రుల పేరుతో ఈ నలుగురూ లేదా ఈ నలుగురి పేర్లతో పాటు ఆస్పత్రుల పేరులో మరెవరైనా బోగస్ బిల్లులు తయారు చేసి సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారా? అనే కోణాల్లో సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం నిర్ధారించడానికి రోగులుగా చెప్పుకున్న నలుగురి వివరాలు ఆరా తీయడంతో పాటు ఆస్పత్రులకు నోటీసులు జారీ చేయనున్నారు. సాధారణంగా సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులన్నీ ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సిఫార్సులతో వారి వ్యక్తిగత సహాయకుల ద్వారానే సీఎంఆర్ఎఫ్‌కు వస్తాయి. ఇవి కూడా అలానే వచ్చాయా? అదే జరిగితే ఆయా ఎమ్మెల్యేలను కలిసింది ఎవరు? వారిని తీసుకువచ్చింది ఎవరు? తదితర కోణాల్లోనూ సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఉదంతం నేపథ్యంలో ఇతర దరఖాస్తులనూ సీఎంఆర్ఎఫ్ అధికారులు పరిశీలించాలని నిర్ణయించారని తెలిసింది. ఈ వ్యవహారంలో ఉన్న దళారుల అంశాన్ని అటు సీఎంఆర్ఎఫ్, ఇటు పోలీసు అధికారులు సీరియస్‌గా తీసుకున్నారని సమాచారం.